భర్తకు
బొత్తిగా భూతదయ
లేకపోయినా
ఆమె జంతువుల్ని
ఎలా పెంచింది?

# ఋణానుబంధ రూపేణా...


సిహెచ్. కామేశ్వరి కథ

జంతువులను ప్రేమించవలెను. భూతదయ కలిగి వుండవలెను. దైవంపట్ల భక్తి పెంచుకోవలెను. ఇలాంటి నీతి పాఠాలు చదవుకొని మార్కులు సంపాయించాడు కాని, వాటిని ఏనాడూ ఆచరణలో పెట్టలేదు మారుతీరావు. దైవభక్తి మొదలే లేదు. అతనికి కుక్కలంటే భయం. పిల్లులంటే అసహ్యం. అటువంటిది, అతని ఇంటిలో అతని ఇద్దరు పిల్లలు ఒక్కగానొక్క భార్యతో పాటు, మారుతీరావు సంపాదన తినడానికి, హక్కుదారులుగా, జూలీ అనబడే కుక్క, దాని పిల్లలు రెండు, కిట్టీ అనబడే ఒక పిల్లి, దాని కూనలు రెండు, మారుతీరావు ఇంటిలో మెంబర్సయ్యాయి.

అతని ఇంటికి వచ్చే చుట్టపక్కాలలో, బంధుమిత్రులందరిలో, నేనొకడిని. అందరితోపాటు కుక్కలంటే భయపడ్తూ, పిల్లులంటే అసహ్యించుకొంటూ, వాడి ఇంటికి వెళ్ళడం తగ్గించేసాను. కాని, మారుతీరావు వాటితో పడిన బాధలు అన్నీ నాకు తెలుసు. మారుతీరావు ఆ జంతువులన్నింటిని ఇంటిలోనుండి వెళ్ళగొట్టడానికి శాయశక్తులా ప్రయత్నం చేశాడు. కాని చిత్తుగా ఓడిపోయాడు. ఎవరి చేతిలోనో తెలుసా? అక్షరాలా వాడి భార్య సరస్వతి చేతిలోనే.

ఆవిడ సాక్షాత్తు శ్రీ సాయిబాబా భక్తురాలు. ఆవిడ ఏ పుస్తకంలోనో చదివిందిట. సాయిబాబా తన భక్తుల ఇంటికి ఏ రూపంలో నయినా వస్తాడని. అందుకని ఏ జంతువునీ త్రుణీకరించకూడదని, భూతదయ చూపించాలని ఆవిడ అభిప్రాయం.

ఈ అభిప్రాయం చెప్పే మారుతీరావు



పళ్ళు కొరుక్కున్నాడు కోపంగా. ''ఆ సాయిబాబాయే పెద్దపులిలాగానో, పాములాగానో వస్తే మీ ఆవిడ ఏం చేస్తుంది?'' అని కొంటెగా ప్రశ్నించాను.

ఆ మాటకి జవాబుగా మారుతీరావు విషాదంగా నవ్వుతూ— ''నాకు మాత్రం ఏ అనుమానమూ లేదురా! వాటిని కూడా మచ్చిక చేసేసుకుని, అర్ధనారీశ్వరుడిలా పా

ముని మెడలో వేసుకుని, కనకదుర్గలా పెద్దపులి మీదే ఎక్కి కూర్చుని ఊరేగుతుంది'' అని వాపోయాడు.

వాడ్ని చూస్తే జాలేసింది నాకు. అవును మరి. రోజూ ఆఫీసు నుండి రాగానే వీధి వాకిటనుండి ఇంట్లోకి వెళ్ళేలోగా వాడివెంట సైన్యంలాగా మూడు పిల్లులు, మూడు కుక్కలు తోకలాడించుకుంటూ ''మ్యావ్..

మ్యావ్... మంటూ — భౌ... భౌ... మంటూ వాడి మీదికి ఎగబడ్తుంటే... వాట్ని తప్పించుకుని వెళ్ళే మారుతీరావుని చూసి నవ్వనివారు లేరుట ఆ వీధిలో. అది చూసి అరికాలి మంట నెత్తికెక్కి ఇంట్లో కెళ్ళి వాళ్ళావిడ సరస్వతిని పిలిచి ''వీటన్నింటినీ తీసుకొని నీ పుట్టింటికిపో... నిన్నూ నీ పిల్లలనే పోషించలేక ఛస్తున్నాను. మీ నాన్నయితే, వీటినేం ఖర్మ! ఏనుగులని కూడా మేపగలడు'' అని గట్టిగా అరిస్తే ఆవిడ ''కాటుక కంటి నీరు చనుకట్టుపయింబడ...'' అన్నరీతిలో మారుతీరావుని శోకసాగరంలో రందులాడించితే, ఆ తర్వాత మారుతీరావే చచ్చినట్లు పెళ్ళాన్ని ఆనందసాగరంలో పడేయడానికి నానాయాతన పడే చివరికి, ఆ మహాతల్లి కళ్ళలో నీళ్ళు పెదాలపై నవ్వు చెక్కిళ్ళపై ఎరుపు తొణికిసలాడుతుండగా (ఇవన్నీ మావాడు చెప్పగా విన్నవే సుమండీ) ఆవిడ తన పాండిత్యాన్నంతా ఒలకపోస్తూ—

రుణానుబంధ రూపేణా పశుపత్ని సుతాలయా? అన్నట్లు యజమాని యొక్క రుణానుబంధంని బట్టి, భార్య పిల్లలు, పశువులు, జంతువులు కూడా! అని మనం అనుకోవాలిట! యజమానితోపాటు ఉంటాయి'' అని హితబోధ చేస్తుందిట.

అంతటితో ఊరుకోకుండా ''పోయినవాళ్ళు మమకారాన్ని చంపుకోలేక ఇష్టమైన వాళ్ళ ఇంటిలో జంతువులుగా పుట్టి వారిచే సేవలు పొందుతాయిట, బహుశా మీ నాన్న తరపు వాళ్ళందరూ కుక్క జాతిగానూ, మీ అమ్మ తరపు వాళ్ళందరూ పిల్లి జాతిగానూ మనింట్లో చేరారేమో'' అందిట ఓసారి.


ఆ మాటకి వాడి ఒళ్ళు జలదరించిపోయిందిట. పాపం కోపం పట్టలేక ''ఇలాంటి పుట్టుకలు మా వాళ్ళెవరూ పుట్టరు. ఎందుకంటే, నాకు జంతువులంటే ఇష్టం ఉండదని, వాళ్ళకి తెలుసు. నీచేత ఇంత చాకిరీ చేయించుకుంటున్నాయూ అంటే... ఇవన్నీ నీ పూర్వీకులేమో! ఆ సంగతి చూసుకో'' అని కవ్విస్తే—

''పోనీలెండి మీ వాళ్ళయితేనేం? మావాళ్ళయితేనేం? నేను ప్రేమగా చూసుకొంటున్నప్పుడు. అందుకే, వాటి మానాన వాటిని ఉండనివ్వండి. ఇంట్లోంచి గెంటమనకండి?' అని చాలా తేలిగ్గా వాడి వాదనని కొట్టిపారేసిందిట.

చేసేది లేక నోరుమ్మూసుకున్నా, వాటికయ్యే ఖర్చు గురించి చెప్పి వాడు బాధపడని రోజు లేదు. పిల్లులకి, కుక్కలకి కలిపి ఒక లీటరు పాలు, అవి కాకుండా కుక్కలకు సబ్బులు, బిస్కెట్లు, డాక్టర్ల దగ్గర ఇంజక్షన్స్ కి తప్పనిసరి ఖర్చు అయ్యేది. అదిగాక ఇంట్లో నాన్ వెజ్ చేస్తే, వాటన్నింటికీ కూడా పెట్టాల్సిందే అని గోలపెట్టేవాడు. వాడి ఖర్చు మాట ఎలా వున్నా వాడు చెప్పే విషయాలు నాకు మాత్రం బాగా నవ్వు తెప్పిస్తూ వుండేవి. వాడు రోజూ సోఫాలో

కూర్చుని పేపరు చదివే టయిమ్‌లో, వాడికెదురుగా మరో సోఫాలో జూలీ (కుక్క) తన సంతానానికి పాలిచ్చుకుంటూ వాడివైపే గర్వంగా చూస్తుందిట. మరోపక్కన కిటీ (పిల్లి) తన సంతానాన్ని ప్రేమగా నాకుకుంటూ, పాలిచ్చుకుంటూ వాడివైపు గుర్రుగా చూస్తుందిట. వాటిని, వాటి చూపులు చూస్తుంటే, మన మారుతీరావుకి తిక్క రేగిపోయేదిట. మనుష్యులు కూర్చునే సోఫాలో ఈ జంతువులు చేరి ఫోజులు కొట్టడం భరించలేకపోయేవాడు. ఎన్నిసార్లు తరిమినా, వచ్చినా అవి లేచేవికావుట, పైగా మారుతీరావునే భయపెట్టేవిట. అది చూసి వాడి భార్య పిల్లలు నవ్వేయిట, అఫ్‌కోర్స్ వాడు చెప్తుంటే, నాకూ నవ్వాగలేదు, కాని, పరస్పరం విరోధ జాతి అయిన కుక్కలు, పిల్లులు, ఇలా ఒకే ఇంటిలో సామరస్యంగా వుండటం ఆశ్చర్యం అనిపించినా, మారుతీరావుకి ఓ సలహా చెప్పాను.

"వాటిల్లో వాటికి కలహం పెట్టు! దెబ్బకి మీ ఆవిడ భయపడి పిల్లులనో, కుక్కలనో వదిలేస్తుంది" అని అన్నాను. అప్పటికి వాటికి పిల్లలు లేవు. నా మాట వాడికి నచ్చి, ఓ రోజున వాళ్ళావిడ వండిన మాంసం కూర ముక్క ఒకటి తీసుకుని రెండింటికీ మధ్య నిలబడి, అందుకోమన్నట్లుగా ఊరిస్తూ చేతిని క్రిందకీ, మీదకీ ఊపాడుట. అంతే! రెండూ శరవేగంతో వాడి చేతి మీదకు దూకేసరికి ఆ అదుటికి మారుతీరావు చేతిలోని ముక్క క్రిందపడటం, వెంటనే కిట్టీ (పిల్లి) దాన్ని నోట కరుచుకుని పారిపోవడం జరిగిందిట. కాని వాడిచేతికి పడ్డ పిల్లి పంటి గాట్లు, కుక్క పంటి గాట్లు మానడానికి ఇరవైనాలుగు ఇంజక్షన్స్ బొడ్డు చుట్టూ చేయించుకోవడానికి ఆరువందలు, అవి తగ్గడానికి ఆరు వారాలు పట్టింది. వాడి తిట్లు (నన్ను తిట్టినవి) మర్చిపోవడానికి ఆర్నెల్లు పట్టింది. మారుతీరావుకీ రోజూ అన్నం తినిపిస్తూ "మీ పేరుకి తగినట్లు అన్నీ కోతివేషాలు



## గ్రంథాలయంలో గంతులు

విద్యాసంస్థలు తమంతట తామే ఫీజుల రూపంలో సంపాదించుకుని ఖర్చుల్ని భరించాలని ఈ మధ్య ప్రభుత్వం అంటోంది. ప్రభుత్వం చెప్పినట్లుగానే.... బొంబాయి విశ్వవిద్యాలయం తమ గ్రంథాలయాన్ని వినోద్ చోప్రా దర్శకత్వం వహిస్తున్న 'లవ్‌స్టోరీ' అనే సినిమా షూటింగ్‌కు అద్దెకు ఇచ్చారట! అనిల్‌కపూర్, మోనిషా కొయిరాలాలు పుస్తకాల షెల్ఫ్‌లమీద, రిఫరెన్స్ బుక్స్ మీద డ్యాన్స్‌చేస్తుంటే కెమెరా [illegible] ఆ విద్యార్థులే షూట్ చేశారట!

—జూపిటర్

వేస్తే ఏమౌతుందీ?'' అని ఎకసెక్కెం చేసిందిట వాళ్ళావిడ. ఆ మాటకి అవమాన భారం నిండిన మనసుతో ఓ రోజు వాళ్ళావిడకే, పిల్లలకే తెలియకుండా సాహసించి జూలీని వాకింగ్‌కని తీసుకెళ్ళి, వాళ్ళ ఇంటికి దూరంగా వెళ్ళాక ఆటో మాట్లాడి దాదాపు మూడు మైళ్ళ దూరంలో ఆటోని ఆపి, దాన్ని దించేసి, వెంటనే అదే ఆటోలో ఇల్లు చేరి జూలీ గొలుసు వదిలించుకొని పారిపోయిందని చెప్పాడుట.

అది విన్న వాళ్ళావిడా, పిల్లలు రెండు రోజులు అన్నం నీళ్ళు ముట్టకుండా ఏడ్చారుట. వీడే, దానిని కావాలని వదిలేసాడు అన్న అనుమానం వ్యక్తపరిచి, వాడిపై కినుక వహించినా, తర్వాత వాళ్ళే ఊరుకుంటారులే! అని అనుకున్నాడు కాని వాడు కూడా మనసులో గిల్టీగా ఫీలయ్యానని అన్నాడు.

కాని, సరిగ్గా మళ్ళీ వారానికి ఇంటికి వచ్చేసిన జూలీ వీడివైపు క్రూరంగా, గర్వంగా చూసి వాళ్ళావిడ ఒళ్ళో ఒదిగిపోవడం చూసి షాకయ్యాడుట. అది విన్న నేనూ తెల్లబోయాను. జూలీ వాడు అలా తనని అలా వదిలేసినందుకిచ్చిన పనిష్మెంట్ ఏమిటంటే? ఆ వారం రోజులు ఎవరితో (ఏ కుక్కతో) తిరిగిందో, కాని తిరిగి వచ్చిన కొన్ని నెలలకే చక్కగా రెండు పిల్లల్ని పెట్టింది. మారుతీరావుని హడలగొట్టేంది.

ఒక్క దాంతోనే ఛస్తుంటే దీన్నీ, దీని పిల్లల్నీ భరించాలా?'' అని, మారుతీరావు కసురుకొన్నా, వాళ్ళావిడ ఏమీ లక్ష్యపెట్టకుండా దాన్ని అతి శ్రద్ధగా చూసి బాలింతపథ్యం జాగ్రత్తగా చేయించింది. చివరగా మారుతీరావు అత్తగారిని శరణువేడాడు. ఆవిడకి కూడా కుక్కలన్నా, పిల్లులన్నా, పరమ చిరాకు. అందుకే ఆవిడనే సరస్వతికి నచ్చజెప్పి వాటి పీడ విరగడ చేయించమని ప్రాధేయపడ్డాడు. ఆవిడ సెంటిమెంట్ అస్త్రం ప్రయోగించి ''కుక్కలున్నా పర్వా లేదు, అవి శుభాల్ని కోరుతాయి. కాని, పిల్లులని పెంచితే, ఇంటికి దరిద్రం, అవి మన కళ్ళు పోవాలని శపిస్తాయి. నా మాట విని పిల్లుల్ని వదిలిపెట్టేయమంది.'' కాని ఈవిడ వినిపించుకోకుండా ''అదేంకాదు ఫారినర్స్ కూడా పిల్లులను పెంచుతారు. పిల్లిని పెంచడం తప్పు ఏమాత్రం కాదు, మాకలాంటి సెంటిమెంట్స్ ఏమీలేవు అయినా మా కిట్టెవచ్చాక (పిల్లి) మేము ఫ్రిజ్ కొన్నాం, కలర్ టీవీ కొన్నాం, మాకలాంటి సెంటిమెంట్స్ ఏమీలేవు'' అని వితండంగా వాదించింది ఆవిడ. దాంతో ఆవిడ మారుతీరావుకి ఓ సలహా చెప్పింది. పిల్లిని మాత్రం ఎప్పుడో అప్పుడు దూరం గా వదిలి పెట్టమని, ఓరోజు వాళ్ళావిడ, పిల్లలు. ఎక్కడికో వెళ్ళగా కిట్టేని ఓ సంచీలో వేసి దాని జిప్ మూసి దాన్ని కూడా ఎంతో దూరంలో వదిలిపెట్టి హుషారుగా ఈలవేసుకుంటూ ఇంటికి వచ్చేసరికి కోపంగా గుర్రుగా 'మ్యావ్' అంటూ అరుస్తూ స్వాగతం చెప్తూన్న కిట్టేనిచూసి హతాస్మి అని తలపట్టుకున్నాడుట.

ఆ మహాతల్లి కూడా ఓ మంచి ముహూర్తాన మాతృమూర్తి అయి రెండు పిల్లలను పెట్టింది. అప్పటినుండి వాడిల్లు ''మూడు కుక్కలు — మూడు పిల్లులుగా కళకళలాడుతోంది. అవి ఎప్పుడయినా మారుతీరావుని విడిచి వెళతాయో వెళ్ళవోగానీ...

. మీరెవరయినా ఓసారి మా మారుతీరావు ఇంటికి వెళ్ళి చూడండేం! అన్నట్లు వాడిల్లు మీకు చాలా ఈజీగా దొరుకుతుంది. ఎలాగా అంటారా! ఏ ఇంట్లోంచి 'మా బుజ్జి తల్లీ. మా బుల్లి తల్లీ ఎక్కడికి వెళ్ళావే! ఆకలేస్తోం దమ్మా! దామ్మా అన్నం పెడ్తాను'' అని అంటున్న మారుతీరావు వాళ్ళావిడ గొంతు తోపాటు భౌ భౌ... మంటూ, మ్యావ్... మ్యావ్... అంటూ వినిపిస్తే అదే మా మారుతీరావు ఇల్లు.

వెళ్ళి చూస్తారుగా...

